ప్రజాశక్తి



ఓట్లు గల్లంతు... ఒకేవ్యక్తికి 10ఓట్లు

బొబ్బిలి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు రోజుల క్రితం వరకు ఆన్‌లైన్‌లో ఉన్న ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తల ఓట్లు గల్లంతయ్యాయి. కొందరికి ఒక్కొక్కరికీ రెండుకు పైగా ఓట్లు ఉండడం గమనార్హం. బొబ్బిలి రాజా కళాశాలలో ఓటు వేసేందుకు వచ్చిన యుటిఎఫ్ నాయకులు పి.స్వప్న, జి.శ్రీదేవి, పి.వెంకటరమణ ఓట్లు, గున్నతోటవలసకు చెందిన అంగన్వాడీ కార్యకర్త కునుకు పార్వతి ఓటు గల్లంతు అయ్యాయి. దీంతో ఓటు వేసేందుకు వచ్చిన వారు నిరాశతో వెనుదిరిగారు. చింతాడకు చెందిన కర్రి లక్ష్మునాయుడుకు 85 పోలింగ్ కేంద్రంలో 10 ఓట్లు ఉండడం గమనార్హం. నకిలీ ఓట్లు ఉంచి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పడతాయనుకున్న ఓట్లను తొలగించారని విమర్శలు వస్తున్నాయి.



997	85	KARRI LAKSHMUNAIDU	RAMU
998	85	KARRI LAKSHMUNAIDU	RAMU
1000	85	KARRI LAKSHMUNAIDU	RAMU
1002	85	KARRI LAKSHMUNAIDU	RAMU
1003	85	KARRI LAKSHMUNAIDU	RAMU
1004	85	KARRI LAKSHMUNAIDU	RAMU
1005	85	KARRI LAKSHMUNAIDU	RAMU
1006	85	KARRI LAKSHMUNAIDU	RAMU
1008	85	KARRI LAKSHMUNAIDU	RAMU
1009	85	KARRI LAKSHMUNAIDU	RAMU
1013	85	MARADANA JAGANNADHAM	SANGAMNAAID
1015	85	DAMODARA RAOtammireddi	APPA RAO tammireddi
1016	85	SWARNALATHA NAGIREDDI	DAMODARA RAOtammireddi

కర్రి లక్ష్మునాయుడు పేరుతో ఉన్న ఓటర్ల జాబితా

మండలాల వారీగా పోలింగ్ వివరాలు

మండలం	మొత్తం ఓటర్లు	పోలైనవి ఓట్లు	పోలింగ్ శాతం
విజయనగరం	17399	11700	67.25
వంగర	878	633	72.10
రేగిడి	1410	1091	77.38
సంతకవిటి	1249	901	72.14
రాజాం	3020	2320	76.82
మెరకముడిదాం	989	846	85.54
గుర్ల	1334	1132	84.86
గరివిడి	1683	1367	81.22
చీపురుపల్లి	1513	1255	82.95
దత్తిరాజేరు	1240	961	77.50
మెంటాడ	953	716	75.13
గజపతినగరం	1641	1368	83.36
బొండపల్లి	1230	998	81.14
గంట్యాడ	2064	1654	80.14
బొబ్బిలి	4536	3234	71.30
రామభద్రపురం	701	572	81.60
బాడంగి	774	564	75.81
తెర్లాం	788	629	79.82
నెల్లిమర్ల	2180	1771	81.24
పూసపాటిరేగ	1269	1076	84.79
భోగాపురం	712	644	90.45
డెంకాడ	1395	1184	84.87
ఎస్.కోట	2535	1872	73.85
వేపాడ	1319	934	70.81
లక్కవరపుకోట	1520	1220	80.26
జామి	1861	1456	78.24
కొత్తవలస	2339	1764	75.42
మొత్తం	**58,502**	**43,862**	**74.98**

వేపాడలో ఓటు వేసేందుకు వచ్చిన నవ వధువు

సమయం	9:00	10:00	11:00	12:00	1:00	2:00	3:00	4:00
పోలింగ్	4.49%	13.3%	23.4%	33.2%	43.56%	53.48%	62.48%	74.98%



బొబ్బిలి.. రాజా కళాశాల పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు

ఓటు హక్కును వినియోగించుకుంటున్న మంత్రి బొత్స సత్యనారాయణ, కలెక్టర్ సూర్యకుమారి

సిరా గుర్తు చూపిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ఓటేసిన ప్రముఖులు

విజయనగరం టౌన్ : విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, ఝాన్సీ దంపతులు స్థానిక కంటోన్మెంటు మున్సిపల్ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రంలో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మంత్రి బొత్సతోపాటు కలెక్టర్ ఎ.సూర్యకుమారి కస్పా మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఓటు వేశారు. జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ మంత్రి అశోక్‌గజపతి రాజు సతీమణి సునీలా గజపతి కూడా ఇదే పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు.

74.98 శాతం పోలింగ్

- ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నిక
- సాధారణ ఎన్నికలను తలపించిన పోలింగ్
- గంటల తరబడి బారులు తీరిన ఓటర్లు
- వైసిపి శిబిరాల్లో ఓవరాక్షన్

గుర్లలో ఓటు వేసేందుకు వికలాంగుడిని తీసుకొస్తున్న పోలీసులు

సిరా గుర్తు చూపిస్తున్న పట్టభద్రులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల్లో 74.98 శాతం ఓటింగ్ నమోదైంది. పోలింగ్ మొత్తం ప్రశాంతంగా జరిగినప్పటికీ, కొంతమంది ఉపాధ్యాయుల ఓట్లు గల్లంతవ్వడం, ఒకరి ఓటు మరొకరు వేయడంతో ఓట్లు కోల్పోయిన వారంతా తీవ్ర నిరాశ, ఆగ్రహానికి గురయ్యారు. సోమవారం ఉదయం 8గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4గంటల వరకు సాగింది. కొన్ని కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరడంతో 5గంటల వరకు కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా 58,502 ఓట్లకు గాను 43,862 (74.98శాతం) ఓట్లు నమోదయ్యాయి. ఉత్తరాంధ్రాలోని ఆరు జిల్లాల్లో విజయనగరం జిల్లాలోనే అత్యధిక ఓట్లు నమోదు కావడం విశేషం. ప్రతి గంటకు 9నుంచి 10శాతం చొప్పున ఓటింగ్ శాతం పెరుగుతూ కనిపించింది. విజయనగరంతోపాటు పలు పట్టణ కేంద్రాల్లో వైసిపి, టిడిపి నాయకుల హడావుడి కనిపించింది. శిబిరాల వద్ద ఎక్కువమంది గుమిగూడుతూ వచ్చిన ఓటర్లకు వంగివంగి నమస్కారాలు చేస్తూ అభ్యర్థించారు. విజయనగరం పట్టణంలోని కంటోన్మెంట్, కస్పా హైస్కూల్ వద్ద పలు సందర్భాల్లో హద్దులు మీరుతూ ఓటర్లను వెంబడించి ఓటు అభ్యర్థించారు. జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్నా పోలీసులు పట్టించుకోలేదు. మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల వద్ద పిడిఎఫ్ మద్దతుదారులు వేసుకున్న టెంటును పోలీసులతో తొలగించి, ఆ స్థానంలో అధికార పార్టీ శిబిరాన్ని ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్లా పిడిఎఫ్ శిబిరాలు కూడా కళకళాడాయి. జిల్లా ఎస్‌పి ఎం.దీపిక పాటిల్ పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమునుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ కేంద్రాల వారీగా జరిగిన ఓటింగ్ వివరాలను వెల్లడించ డంలో అధికార యంత్రాంగం విఫల మైంది. కనీసం మీడియా సెంటర్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో తాజా సమాచారం వెల్లడికాలేదు. జిల్లా వ్యాప్తంగా వందలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఓట్లు గల్లంతయ్యాయి. ఓటమి భయంతో తమను ప్రభుత్వం టార్గెట్ చేసి ఓట్లు గల్లంతు చేసిందని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ సూర్యకుమారి ఆదేశాల మేరకు బూత్‌ల వారీగా వేర్వేరు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఓటర్లకు అవగాహన కల్పించేందుకు క్యూలైన్ల పక్కనే నమూనా బ్యాలెట్ పత్రాన్ని ప్రదర్శించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వైద్యారోగ్యశాఖ సిబ్బందితో ప్రథమచికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసి, వివిధ రకాల మందులను అందుబాటులో ఉంచారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్దా వీడియో రికార్డింగ్ చేశారు. పోలింగ్ కేంద్రాలవద్ద ప్రజలు గుమిగూడకుండా, వంద మీటర్ల దూరంలోనే బారికేడ్లు ఏర్పాటు చేసి, వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అయినప్పటికీ వైసిపి నాయకులు, కార్యకర్తలు పోలింగ్ కేంద్రాల వద్ద హడావుడి చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద యథేచ్ఛగా ప్రచారం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో రూములను తక్కువగా కేటాయించడం వల్ల గంటల తరబడి ఓటర్లు క్యూలో ఉండాల్సి వచ్చింది. పలు పోలింగ్ కేంద్రాలను డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, డిప్యూటీ కలెక్టర్ శ్రీకర్ పరిశీలించారు.

ఎల్.కోటలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు వై.వి, తమ్మినేని; కొత్తవలసలో బారులు తీరిన ఓటర్లు

ప్రశాంతంగా ఎన్నిక : ఎస్‌పి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నిక పోలింగ్ ఎటువంటి సంఘటనలూ చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగిసిందని ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. పోలీసు బందోబస్తుతో, ముందస్తు వ్యూహ రచనతో ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. జిల్లాలో 72 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు అన్ని భద్రత చర్యలు చేపట్టామన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ఎస్‌ఐ స్థాయి అధికారిని నియమించామని, బందోబస్తు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఒక్కొక్క రూట్‌కు సిఐ స్థాయి అధికారిని నియమించామని తెలిపారు. కేంద్రాల్లో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదన్నారు. జిల్లాలోని భోగాపురం,పూసపాటి రేగ, డెంకాడ, విజయనగరం పట్టణంలోని సంస్కృత పాఠశాల, ఎం.ఆర్ సంగీత కళాశాల, ఎం.ఆర్ కళాశాల,కస్పా మున్సిపల్ హైస్కూల్ మరియు కంటోన్మెంట్ మున్సిపల్ హై స్కూలులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎస్‌పి పరిశీలించి భద్రతా సిబ్బందిని, అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసారు. ఎస్‌పి వెంట డిఎస్‌పిలు ఆర్.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వర్లు, పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

డెంకాడ.. పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి దీపిక

నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్‌చంద్ర పట్నాయక్

ఓటుపై వేటు

యుటిఎఫ్ అధ్యక్షుడు సహా ఉపాధ్యాయ, ఉద్యోగుల ఓట్లు గల్లంతు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలోని పలువురు పట్టభద్రుల ఓట్లు గల్లంతయ్యాయి. పోలింగ్ ముందు వరకు ఓటరు జాబితాలో పేర్లు ఉన్న పలువురు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేసరికి ఓటు లేదని అక్కడ సిబ్బంది చెప్పడంతో వారంతా నిర్ఘాంత పోయారు. ఈ విధంగా ఒక్క విజయనగరంలోని కస్పా హైస్కూలు పోలింగ్ కేంద్రంలోనే 33 మంది ఓట్లు గల్లంతయ్యాయి. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.రమేష్‌చంద్ర పట్నాయిక్‌కు ఈ పోలింగ్ కేంద్రంలో బూతు నెంబరు 128-ఎలో సీరియల్ నెంబరు 1755తో ఆయనకు ఓటు ఉంది. తీరా ఆయన ఓటు వేసేందుకు కేంద్రంలోకి వెళ్లేసరికి ఓటరు జాబితాలో పేరు ఎదురుగా డిలిట్ అని స్టాంప్ వేసి ఉండడంతో ఆయనకు ఓటు ఇచ్చేందుకు అధికారులు నిరాకరించారు. దీంతో తన ఓటు ఎందుకు తొలగించారో చెప్పాలని ఆయన అధికారులను ప్రశ్నించడంతో పాటు నిరసన తెలిపారు. తనకు ఛాలెంజింగ్‌ఓటు అయినా ఇవ్వాలని కోరారు. ఆ సమయంలో పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చిన డెప్యూటీ కలెక్టర్ శ్రీకర్‌ను, తహశీల్దార్ బంగార్రాజును నిలదీశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు రాసి పంపించామని, సాయంత్రం లోపు ఓటు హక్కు కల్పిస్తామని నమ్మ బలికారు. ఓటు హక్కు కల్పించే వరకు ఇక్కడే ఉంటానని, రాజ్యాంగం కల్పించిన హక్కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు సాయంత్రం వరకు వేచి ఉంచి చివరకు ఏమీ చేయలేమని చేతులెత్తేశారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వి.ఆనందరావు కస్పా హైస్కూలు కేంద్రంలో ఓటు వేసేందుకు రాగా, ఆయన ఓటును ఎవరో వేసేయడంతో ఆయన నిరాశతో ఎదురు తిరిగారు. ఇలా ఈ ఒక్క కేంద్రంలోనే 33 మంది ఓట్లు గల్లంతయ్యాయి. అధికార వైసిపిపై ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో ఎక్కువగా వ్యతిరేకత ఉండడంతో ఇలా ఓట్లును తొలగించారని వారంతా వాపోయారు.

జోరుగా దొంగోట్లు

జిల్లా కేంద్రంలో అర్హత లేకుండా పలువురి ఓట్లను వైసిపి నాయకులు చేర్పించి వారందరి తోనూ ఓట్లు వేయించారు. మరోవైపు దొంగ ఓట్లు కూడా వేయించినట్లు తెలిసింది. లక్కవరపు కోటలో చివరి నిముషంలో దొంగ ఓట్లు వేసేందుకు పోలింగ్ కేంద్రంలోకి పలువురు ప్రవేశించగా ఎస్‌ఐ యువరాజు అడ్డుకున్నారు.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

- పోలింగ్ కేంద్రాల వద్ద వైసిపి ప్రచారం
- 'జై జగన్' అంటూ నినాదాలు
- చోద్యం చూసిన పోలీసులు

కస్పా హైస్కూల్ పోలింగ్ కేంద్రం సమీపంలో ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా కేంద్రమైన విజయనగరంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా వైసిపి నాయకులు హంగామా చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి పోలింగ్ బూతుల వద్ద యథేచ్ఛగా ప్రచారం నిర్వహించారు. తమ అభ్యర్థికి ఓటు వేయాలని పోలింగ్ కేంద్రం వరకు కార్యకర్తలు, నాయకులు ప్రచారం నిర్వహించినా పోలీసులకు పట్టలేదు. పైగా జగన్ అంటూ వైసిపి నాయకులు నినాదాలు చేస్తూ హడావుడి చేశారు. పోలింగ్ కేంద్రం లోపల ప్రచారం చేయడంతో పాటు, ప్రలోభాలకు గురి చేయడం, బెదిరించడం వంటి చర్యలకు పాల్పడ్డారు. కస్పా హైస్కూల్లో ఉదయం నుంచి జరిగిన పోలింగ్ ప్రశాంతంగా జరుగుతున్నా అధికార పార్టీ నాయకులు పదే పదే లోపలికి వెళ్లి ప్రచారం చేయడం, మీరు ఓటు వేస్తే బాగుంటుంది, లేకుంటే ఇబ్బందులు పడతారని హెచ్చరించడం వంటి చర్యలు చేపట్టారు. ముందు రోజు రాత్రి ఓటుకు నాలుగువేలు ఇచ్చి ఓట్లు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అధికార పార్టీకి దీటుగా తెలుగుదేశం నాయకులు కూడా పదే పదే ఓటర్లు దగ్గరికి వెళ్లి ప్రచారం చేపట్టారు. అన్ని ప్రాంతాల నుంచి పోలింగ్ బూతులకు ఓటర్లను వాహనాల్లో తరలించారు.

సెలవు ఇవ్వని అధికారులు

ఎన్నికల కమిషన్ చెప్పినా కింది స్థాయి ఉద్యోగులకు కొన్ని చోట్ల సెలవులు అధికారులు సెలవు ఇవ్వలేదు. దీంతో వారంతా వారు ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. ప్రయివేటు సంస్థలు ఎన్నికల కమిషన్ నిబంధనలను పూర్తిగా బేఖాతరు చేశాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు పోలింగ్ కాకుండా ఉండేందుకు ప్రయివేటు సంస్థలు సెలవు ఇవ్వలేదని ఓటర్లు చెబుతున్నారు. దీంతో చాలా మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించులేకపోయారు. కొన్ని శాఖల్లో కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అధికార పార్టీ ఒత్తిడితో కొందరు అధికారులు సెలవు ఇవ్వలేదని తెలిసింది.

బిజెపి అధ్యక్షురాలి బరితెగింపు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా బిజెపి అధ్యక్షురాలు రెడ్డి పావని గజపతినగరంలోని తమ బాలాజీ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో ప్రచారం చేయించడాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలాజీ పాలిటెక్నికల్ కళాశాల యాజమాన్యం హాస్టల్ విద్యార్థులను జిల్లావాప్తంగా బస్సులతో పంపి బిజెపి అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేయించారని తెలిపారు. టెంట్లలో కూర్చోబెట్టి స్లిప్‌లు రాయించారు. మరికొన్ని చోట్ల ఏజెంట్లుగా నియమించారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో వేలకు వేలు ఫీజులు కట్టి చదవిస్తే ఎన్నికల ప్రచారం చేయించడం అన్యాయమని అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా అధికారులు చూడాలని కోరారు.

బిజెపి శిబిరంలో ఉన్న పాలిటెక్నిక్ విద్యార్థులు

ప్రభుత్వ పనితీరే వైసిపి అభ్యర్థిని గెలిపిస్తుంది

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

రాష్ట్ర ప్రభుత్వ పని తీరే ఎమ్మెల్సీ ఎన్నికలు లో వైసిపి అభ్యర్థి గెలుపుకు దోహద పడుతుందన్నారు. ఓటర్లు ఉత్తరాంధ్ర అభివద్ధి వైసిపి తో సాధ్యమని నమ్మి ఓట్లు వేస్తున్నారని నమ్మకం మాకు ఉందన్నారు. ఓటింగ్ ప్రశాంతంగా జరిగే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు ను వినియోగించు కోవాలని ఆయన కోరారు.



టెండర్ ఓటు వేసిన విఆర్‌ఒ వేణు

టెండర్ ఓటు వేసిన విఆర్‌ఒ

తెర్లాం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో బొబ్బిలి మండలం పక్కిలో విధులు నిర్వహిస్తున్న విఆర్‌ఒ గేదెల వేణు టెండర్ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి వచ్చింది. విఆర్‌ఒ వేణుది తెర్లాం మండలం గంగన్నపాడు గ్రామం. ఓటు వేసేందుకు తెర్లాం హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగు కేంద్రానికి వెళ్లారు. ఒకే పేరుతో ఇద్దరు వ్యక్తులు ఉండడంతో ఆయన ఓటు హక్కును వేరొకరు వినియోగించుకున్నారు. వేణుకు ఓటు వేసేందుకు అవకాశం లేక టెండర్ ఓటు వేసే అవకాశం కల్పించారు.

పట్టుదల చూపిన పట్టభద్రులు

- ప్రతి గంటకూ 10 శాతం ఓటింగ్ పెంపు
- ఎండకు వెరవలేదు... సహనాన్ని వీడలేదు
- ఉత్తరాంధ్రలో విజయనగరంలోనే అత్యధిక ఓటింగ్

ఎంఆర్ సంస్కృత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉత్తరాంధ్ర పట్టభద్రులంతా సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒకింతపట్టుదల కనబరిచారు. ఎండకు వెరవలేదు. సహనంతో క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షించారు. సాధారణ ఎన్నికలను తలపించే విధంగా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎక్కువ మందిలో ఓటు వేసి తీరాలన్న కసి, పట్టుదల కనిపించింది. జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్లా ఉదయం 8గంటలకే పోలింగ్ ప్రారంభమైంది. 9 గంటల సమయానికి 4.49శాతం ఓటింగ్ నమోదు కాగా, 10గంటలకు 13.3శాతానికి పెరిగింది. 11గంటలకు 23.4శాతం, మధ్యాహ్నం 12గంటలకు 33.2శాతం చొప్పున నమోదయ్యింది. 1గంటకు 43.56శాతానికి చేరుకోగా, 2గంటలకు సమయానికి 53.48 శాతంగా నమోదైంది. 3గంటలకు 62.48శాతం ఓటింగ్ నమోదవ్వగా, పోలింగ్ పూర్తయ్యే సమయానికి 75శాతానికి పెరిగింది. ఈలెక్కన ప్రతి గంటకు సగటును 10శాతం ఓటింగ్ నమోదైంది. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగం, వ్యాపారాలు చేసుకుంటూ స్థిరపడినవారు, తమ సొంత మండలాల్లో ఓట్లు హక్కు ఉండడంతో తెల్లవారక ముందే ఆయా పోలింగ్ కేంద్రాలకు పయనమయ్యారు. మరికొంతమంది ముందు రోజు రాత్రికే స్వగ్రామాలకు చేరుకుని ఓటింగ్‌లో పాల్గొన్నారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈ సారి ఓటింగ్ శాతం బాగానే పెరిగింది. 2017లో జరిగిన ఇదే పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో రాజాం, సంతకవిటి, వంగర, రేగిడి మండలాలను మినహాయిస్తే మిగిలిన 23మండలాల పరిధిలో 26,774 ఓట్లకుగాను 18,660 (69.69శాతం) ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఈ సారి 5.31 శాతం ఓట్లు పెరిగాయి. అత్యధికంగా భోగాపురం మండలంలో 90.45 శాతం ఓట్లు పోలయ్యాయి. అత్యల్పంగా విజయనగరంలో 67.25 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం ఓట్లు ఉపయోగించుకున్న వారిలో 75.50 శాతం పురుషులు, 73.99 శాతం మహిళలు ఉన్నారు.

ఆలస్యంగా వచ్చిన ఓటర్లకు నో ఎంట్రీ

విజయనగరంటౌన్ : ఓటు వేసేందుకు ఆలస్యంగా వచ్చిన ఓటర్లకు అధికారులు అనుమతించలేదు. జిల్లా కేంద్రంలోని పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ ముగింపు సమయం 4గంటలకు పోలీసులు గేట్లు వేసేశారు. విజయనగరంలోని కస్పా హైస్కూలు, కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూలు పోలింగ్ కేంద్రాలకు ఒక నిమిషం ఆలస్యంగా వచ్చిన పలువురు ఓటర్లను సమయం అయిపోయిందంటూ లోపలకు అనుమతించలేదు. తాము విజయవాడ నుంచి వచ్చామని, ఓటు హక్కు కల్పించాలని ఓ మహిళ కస్పా హైస్కూలు వద్ద పోలీసు అధికారులను బతిమలాడినప్పటికీ అనుమతివ్వలేదు. ఇలా కస్పా హైస్కూలు వద్ద పది మంది, కంటోన్మెంట్ పోలింగ్ కేంద్రం వద్ద ఐదుగురు మహిళలు ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు. సమయం ముగియడానికి నిమిషం ముందు పోలీసులు ఎవరైనా ఉంటే తొందరగా రావాలని పిలవడంతో పలువురు ఓటర్లు పోలింగ్ కేంద్రం ప్రాంగణంలోకి పరుగులు తీశారు.

కస్పా హైస్కూలు వద్ద గేట్లు మూసేయడంతో పోలింగ్ కేంద్రం సిబ్బందిని బతిమలాడుతున్న మహిళా ఓటరు

ఓటెత్తిన పట్టభద్రులు

విజయనగరంలో బారులు తీరిన ఓటర్లు

బొబ్బిలి.. సిరా గుర్తును చూపిస్తున్న ఆర్‌డిఒ శేషశైలజ, అధికారులు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి రాజా కళాశాలలో ఏర్పాటు చేసిన ఆరు పోలింగ్ కేంద్రాలలో 4536 ఓట్లకు గాను 3,234 ఓట్లు నమోదు అయ్యాయి. బొబ్బిలి పట్టణ, గ్రామీణ ప్రాంతాల పట్టభద్రులు ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఉత్సాహం చూపడంతో 74 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్లిన వారు కూడా ఓటు వేసేందుకు సొంత గ్రామాలకు చేరుకున్నారు. రాజా కళాశాలలో ఓటు వేసేందుకు పట్టభద్రులు క్యూకట్టారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైనా, 10 గంటల వరకు నత్తనడకన పోలింగ్ సాగింది. 10 గంటల తర్వాత పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారు. దీంతో ఓటు వేసేందుకు గంటల తరబడి క్యూలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సాయంత్రం 4 గంటల తర్వాత కూడా ఓటు వేసేందుకు క్యూలో ఉండడంతో ఎన్నికల అధికారులు క్యూలో ఉన్నవారికి స్లిప్పులు ఇచ్చారు. రెండు పోలింగ్ బూత్‌లలో సాయంత్రం 4.45 గంటల వరకు పోలింగ్ జరిగింది. బొబ్బిలి రాజా కళాశాలలో ఆర్‌డిఒ పి.శేషశైలజ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. రాజా కళాశాలలో పోలింగ్ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ మయూర అశోక్ పరిశీలించారు. జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్ జరిగిందని అశోక్ అన్నారు.

దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించి..

లక్కవరపుకోట : లక్కవరపుకోట హైస్కూల్లో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో 1520 మంది ఓటర్లకు గాను 1220 మంది (80.26 శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో మహిళా ఓటర్లు 383, పురుషులు 837 మంది ఉన్నారు. సాయంత్రం పోలింగ్ ముగిసే సమయంలో దొంగ ఓట్లు వేసేందుకు పోలింగ్ కేంద్రంలోకి కొందరు ప్రవేశించగా ఎఎస్‌ఐ యువరాజు అడ్డగించారు. జోనల్ ఎన్నికల అధికారి అరుణకుమారి ఆదేశాల మేరకు వారిని బయటకు పంపించారు. పోలింగ్ సరళిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పరిశీలించారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎంపిపి గేదెల శ్రీనివాసరావు వైసిపి శిబిరాన్ని సందర్శించారు. తహశీల్దార్ తామరాపల్లి రామకృష్ణ పర్యవేక్షణలో శృంగవరపుకోట సిఐ ఎస్.సింహాద్రినాయుడు, ఎస్‌ఐ ఎం.ముకుందరావు బందోబస్తు పర్యవేక్షించారు.

గంట్యాడ.. భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

బాడంగి : బాడంగి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 744 ఓట్లకు గాను 564 మంది (75.8 శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 398, స్త్రీలు 166 ఉన్నారు. బొబ్బిలి రూరల్ సిఐ తిరుమల ప్రసాద్, బాడంగి ఎస్‌ఐ ఆర్.జయంతి, ఎఎస్‌ఐ కొండలరావు బందోబస్తును పర్యవేక్షించారు.

రామభద్రపురం : రామభద్రపురం హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 701 ఓట్లకు గాను 572 మంది (81.59 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పట్టభద్రులు ఎండను సైతం లెక్క చేయక బారులుతీరి ఓటు వేశారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, బొబ్బిలి డిఎస్‌పి మోహనరావు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఎస్‌ఐ సురేంద్రనాయుడు బందోబస్తు ఏర్పాటుచేశారు.

జామి : జామి హైస్కూల్లో మూడు పోలింగ్ బూతుల్లో ఎన్నికలు నిర్వహించారు. 1860 ఓటర్లకు 1,456 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 78.24 శాతం ఓటింగ్ నమోదైంది. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు, కొప్పలవెలమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నెక్కలి నాయుడుబాబు వైసిపి శిబిరాన్ని సందర్శించారు. మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, గొంప కృష్ణ టిడిపి శిబిరాన్ని సందర్శించారు. తహశీల్దార్ హేమంత్ కుమార్, ఎస్‌ఐ వీరబాబు పర్యవేక్షించారు.

శృంగవరపుకోట : మండలంలో 2524 ఓట్లకు గాను 1989 ఓట్లు (78.80 శాతం) పోలైనట్లు తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 8 గంటలకే ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైనా పది గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగింది. ఓటు వేసేందుకు వచ్చిన ఒక యువకుడు అస్వస్థతకు గురవడంతో కొట్టాం పిహెచ్‌సి వైద్య సిబ్బంది వెంటనే సేవలందించారు. జిసిసి చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి, ఆమె భర్త గణేష్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పోలింగ్ సరళిని పరిశీలించారు. సిఐ సింహాద్రి నాయుడు, ఎస్‌ఐ తారకేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొత్తవలస : కొత్తవలస హైస్కూల్లో ఏర్పాటుచేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో 2339 ఓట్లకు గాను 1774 ఓట్లు పోలయ్యాయి. 75.16 శాతం పోలింగ్ జరిగిందని తహశీల్దార్ ఎం.ప్రసాదరావు తెలిపారు. తొలుత మందకొడి పోలింగ్ సాగడంతో మధ్యాహ్నం 12 గంటల సమయానికి 28 శాతం నమోదైంది. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి వేగం పుంజుకోవడంతో 55 శాతానికి చేరింది.

వేపాడ : వేపాడ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో 1312 ఓట్లకు 934 ఓట్లు (70.81 శాతం) పోలయ్యాయి. డిఎస్‌పి మోహనరావు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. తహశీల్దార్ కృష్ణంరాజు, ఎస్‌ఐ రాజేష్ పర్యవేక్షించారు. పిడిఎఫ్ శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, వైసిపి శిబిరాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, డిసిఎంఎస్ చైర్మన్ వివి చినరామునాయుడు, టిడిపి శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ, మండల అధ్యక్షులు గొంప వెంకటరావు సందర్శించారు. వారి వెంట ఎఎంసి చైర్‌పర్సన్ మూకల కస్తూరి, ఎంపిపి డి.సత్యవంతుడు, జెడ్‌పిటిసి అప్పలనాయుడు, వైసిపి నాయకులు ఎం.సత్యనారాయణ, ఎం.జగ్గుబాబు, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, టిడిపి మండల ప్రధానకార్యదర్శి కె.రమణమూర్తి, నాయకులు సేనాపతి గణేష్ ఉన్నారు.

శృంగవరపుకోట.. పోలింగ్ కేంద్రం వద్ద అస్వస్థతకు గురైన యువకుడికి వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

గజపతినగరం : గజపతినగరంలోని రెండు పోలింగ్‌కేంద్రాల్లో 83.42శాతం ఓట్లు పోలయ్యాయి. 99,100 నెంబరు బూత్‌ల్లో 1641 ఓట్లకు గాను 1368 ఓట్లు పోలై 83.36శాతంగా నమోదైంది. రెండు పోలింగ్ కేంద్రాలు మాత్రమే ఏర్పాటు చేయడంతో ఓటర్లు అర కిలోమీటరు వరకు బారులు తీరారు. ఎండ తీవ్రతతో ఇబ్బంది పడ్డారు. పోలింగ్ కేంద్రాల వద్ద వైసిపి నాయకుల హడావుడి కనిపించింది. బొండపల్లిలో 1230ఓట్లకు 1011 ఓట్లు పోలై 82.18శాతం, దత్తిరాజేరులో 1240 ఓట్లకు 961 ఓట్లు పోలై 77.5శాతం, మెంటాడలో 953 ఓట్లకు 716 పోలై 75.13శాతం పోలింగ్ నమోదైంది.

బొండపల్లి : బొండపల్లి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 1230 ఓట్లకు గాను 998 (81 శాతం) మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. తహశీల్దార్ శ్రీనివాస మిశ్రా, గజపతినగరం సిఐ నారాయణరావు పర్యవేక్షణలో ఎస్‌ఐ రవి బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ సరళిని మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు అడిగి తెలుసుకున్నారు.

రామభద్రపురం.. పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెసి మయూర్ అశోక్

గంట్యాడ : గంట్యాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాల్లో 2064 ఓట్లకు గాను 1654 పోలయ్యాయి. 80 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రం వద్ద ఎస్‌ఐ కిరణ్‌కుమార్ నాయుడు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు ఓటు హక్కును వినియోగించుకున్నారు. డిఎస్‌పి శ్రీనివాసరావు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు.

మెంటాడ : మెంటాడ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 953 మంది ఓటర్లకు 716 మంది (75 శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి ఆదిబాబు తెలిపారు. అందులో పురుషులు 523, మహిళలు 193 మంది ఉన్నారు. ఆంధ్ర ఎస్‌ఐ సిద్ధార్థ కుమార్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

నెల్లిమర్ల: స్థానిక జెడ్‌పి బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో 2180 ఓట్లకు గాను 1771 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 81.23 శాతం నమోదైంది. రెవెన్యూ సిబ్బంది వికలాంగులను దగ్గరుండి పోలింగ్ కేంద్రాలకు తరలించి ఓట్లు వేసే విధంగా చర్యలు తీసుకున్నారు. **గుర్ల :** మండలంలోని 1334 ఓట్లుకు గాను 1131 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 84.78 శాతం నమోదైంది.

చీపురుపల్లి: మండలంలోని 1513 ఓట్లకు గాను 1255 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 82.94 శాతం నమోదైంది.

గరివిడి: మండలంలోని 1683 ఓట్లకు గాను 1373 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 81.58 శాతం నమోదైంది.

మెరకముడిదాం: మండలంలోని 989 ఓట్లకు గాను 846 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 85.54 శాతం నమోదైంది.

వంగర : మండలంలోని 878 ఓట్లుకు గాను 633 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 72.09 శాతం నమోదైంది. ఎన్నికల పరిశీలకులు నూకరాజు, జోనల్ ఆఫీసర్ టి. చంద్రశేఖర్, తహశీల్దార్ ఐజాక్, ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఎస్‌ఐ బి లోకేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రశాంతంగా ముగిశాయి.

భోగాపురం: మండలంలోని 712 ఓట్లుకు గాను 644 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 90.44 శాతం నమోదైంది. జిల్లా ఎస్‌పి దీపికా పాటిల్ భోగాపురం పోలింగ్ కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. వివిధ పార్టీల వారు పోలింగ్ కేంద్రానికి దగ్గరలో వేసిన టెంట్లను సంబంధిత అధికారులకు చెప్పి తొలగించారు. సిఐ విజయనాథ్, తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఎస్‌ఐ కృష్ణమూర్తి పర్యవేక్షించారు. మండలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, ఎంపిపి ఉప్పాడ అనూష, ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, సవరవిల్లి గ్రామ సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కర్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రేగిడి: మండలంలోని 1410 ఓట్లుకు గాను 1081 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 76.66 శాతం నమోదైంది. ఉంగరాడ మెట్ట గురుకుల పాఠశాలలో నిర్వహించిన పోలింగ్ కేంద్రాన్ని ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు సందర్శించి ఓటింగ్ సరళిని పిఒలను అడిగి తెలుసుకున్నారు.

డెంకాడ: మండలంలోని 1395 ఓట్లుకు గాను 1184 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 84.87 శాతం నమోదైంది.

పూసపాటిరేగ: మండలంలోని 1245 ఓట్లుకు గాను 1076 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 86.42 శాతం నమోదైంది.

కొత్తవలస.. ఓటు హక్కును వినియోగించుకున్న నాయుడుబాబుతో ఎమ్మెల్యే కడుబండి

సంతకవిటి : మండలంలోని 1249 ఓట్లుకు గాను 901 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 72 శాతం నమోదైంది.

రాజాం: మండలంలోని 3200 ఓట్లుకు గాను 2320 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 76.82 శాతం నమోదైంది.

స్ట్రాంగ్‌రూమ్‌కు చేరుకున్న బ్యాలెట్ బాక్సులు

దూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

మదనాపురంలో పులి కలకలం

- దాడిలో దూడ మృతి
- అప్రమత్తమైన అటవీ శాఖ సిబ్బంది

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని మదనాపురం గ్రామ శివారులో గేదె దూడపై పులి దాడి చేసి హతమార్చింది. సోమవారం ఈ విషయం వెలుగు చూసింది. పులి దాడిలో గ్రామానికి చెందిన వర్రి శ్రీనుకు చెందిన గేదె దూడ మృతిచెందింది. దూడ కళేబరం ఉన్న ప్రదేశంలో పాదముద్రలు పులివిగా అనుమానించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని పులి పాదముద్రలుగా నిర్ధారించారు. పులి దాడి కారణంగానే గేదె దూడ మృతి చెందినట్లు తేల్చారు. అటవీ శాఖ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అడవికి వెళ్లవద్దని అప్రమత్తం చేశారు.

వాలీబాల్ అసోసియేషన్ జిల్లా సహాధ్యక్షులుగా రామకృష్ణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వాలీబాల్ అసోసియేషన్ జిల్లా సహాధ్యక్షులుగా పట్టణానికి చెందిన విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ఎం.రామకృష్ణ ఎన్నికయ్యారు. విజయనగరంలోని సిటీ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్నికలో రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పొట్నూరు శ్రీరాములు తెలిపారు. రామకృష్ణ జాతీయస్థాయి వాలీబాల్ క్రీడాకారుడిగా, కోచ్‌గా అనేకమంది క్రీడాకారులను తయారుచేశారని తెలిపారు. జిల్లాలో వాలీబాల్ క్రీడాభివృద్ధికి సేవ చేశారని వెల్లడించారు. రామకృష్ణకు పదవి రావడం పట్ల శ్రీరాములు, క్రీడాకారులు హర్షం వ్యక్తంచేశారు.

విద్యా వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

కురుపాం : ఐటిడిఎ పరిధిలో కొనసాగుతున్న సవర భాష విద్యా వాలంటీర్లను ప్రభుత్వం తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండల కేంద్రంలో ఆమె పత్రిక విలేకరులతో మాట్లాడారు. పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల పరిధిలో గిరిజన విద్యార్థులకు సవరభాష ద్వారా వారికి అర్థమయ్యే భాషలో విద్యను అభ్యసించేందుకు ప్రత్యేకంగా అప్పటి ప్రభుత్వం 332 మందిని నెలకు రూ.5వేలు జీతం ఇస్తూ నియమించిందన్నారు. దీంతో వారు వారి గ్రామాల్లో ఉంటూ కొంత కుటుంబ పోషణకు ఉపయోగపడుతూ గిరిజన విద్యార్థులకు వారికి అర్థమయ్యే భాషలో విద్యను అందించేవారిని చెప్పారు. గత మూడు సంవత్సరాలుగా వారిని తొలగించారంటే గిరిజనులకు విద్యను దూరం చేయడమే తప్ప వేరే ఉద్దేశం కాదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి తక్షణమే సవర భాష వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని లేనిచో వారి పక్షాన ఆందోళనలు నిరాహార దీక్షలు చేసి వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

ముగిసిన అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు అన్నారు. సోమవారం సాయంత్రం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో అంతర్ విశ్వ విద్యాలయాల క్రీడా ముగింపు పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో పాల్గొనడం వల్ల వారికి ఏకాగ్రత పెరగడంతో పాటు చదువులో బాగా రాణించగలరన్నారు. గత నాలుగు రోజులుగా అథ్లెటిక్ పోటీలతోపాటు కబడ్డీ, ఖోఖో, బాస్కెట్ బాల్, వాలీబాల్, త్రో బాల్, పుట్ బాల్, క్రికెట్, యోగా, కత్తి యుద్ధం, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, చెస్, తదితర పోటీలలో 500 మంది విద్యార్థులు పాల్గొనడం ఆనందదాయకమన్నారు. ఈ పోటీలలో అత్యధిక బంగారు పతకాలను సాధించిన విజయనగరం క్యాంపస్‌కు చెందిన మని వరన్‌కు వైస్ ఛాన్సెలర్ అవార్డు కింద రూ.5వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ క్రీడా పోటీలలో పర్లాకిమిడి, రాయగడ, ఒడిశా, చత్రపూర్, బోలాంగిర్, గోపాల్ పూర్, విజయనగరం క్యాంపస్ నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ఎస్ వర్మ, డాక్టర్ సన్నీ డియోల్, డీన్ డాక్టర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'శారద'లో భద్రతా వారోత్సవాలు

భద్రతా వారోత్సవాల్లో మాట్లాడుతున్న నారాయణ

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని కంటకాపల్లి వద్దనున్న శారద పరిశ్రమలో 52వ జాతీయ భద్రతా వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జివివిఎస్ నారాయణ మాట్లాడుతూ ఫ్యాక్టరీలో సేఫ్టీ విధానం తూచ తప్పక పాటించాలన్నారు. ఫ్యాక్టరీలో పనిచేసేవారు పరిశ్రమ విధానాలను పాటించకుంటే ప్రమాదాలకు గురయ్యే అవకాశముందన్నారు. కార్మికులు పాటించాల్సిన భద్రతా నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో మెకానికల్ అండ్ మెయింటైనెన్స్ సీనియర్ జిఎం అనంత్ కుమార్), పిపి ఆపరేషన్ జిఎం సన్యా పరక్, ఫేడ్ ఆపరేషన్ డిజిఎం టి.వెంకట్‌శివ, డిజిఎం సన్యాసిరావు, ఎజిఎం ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన తైక్వాండో క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 10 నుంచి 12వ తేఈ వరకు యలమంచిలి వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజులు పాటు జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో విజయనగరం ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు తెలిపారు. జిల్లాకు ఐదు పసిడి, ఐదు రజిత, 17 కాంస్య పథకాలు సాధించారని తెలిపారు. బంగారు పతకాలు సాధించన క్రీడాకారులు ఈనెల 28నుంచి 31 వరకు రాజస్థాన్‌లో జరుగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ వేణుగోపాల్ అభినందించారు.

రన్నర్ ట్రోఫీ అందుకుంటున్న విజయనగరం జట్టు

టిడిపి నాయకుడు జాగరపు మృతి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు జాగరపు పెదరాము నాయుడు(86) సోమవారం మృతిచెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నారు. కాంగ్రెస్, టిడిపిలో పనిచేశారు. సర్పంచ్, ఎంపిటిసి పదవులను చేపట్టారు.

జాగరపు పెదరామునాయుడు(ఫైల్)

సారా స్థావరాలపై మెరుపు దాడులు

18వేల లీటర్ల బెల్లం ఊట, 220 లీటర్ల సారా ధ్వంసం

పార్వతీపురం టౌన్ : ఎస్ఇబి పోలీసులు, ఒడిశా ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా ఆంధ్ర ఒడిషా సరిహద్దు సమీపంలో పూర్తిగా ఆంధ్ర ప్రాంత గ్రామాలకు నాటు సారా రవాణా చేసే ఒడిషా గ్రామలైన హాటిగడ, రేవటిగుడ సమీపంలో కొండ ప్రాంతంలో నాటు సారా స్థావరాలపై సోమవారం దాడులు చేశారు. 18వేల లీటర్ల నాటు సారా తయారు చేసే బెల్లం ఊటలు, 220 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. ఒడిషా అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ ఉపేంద్ర తెలిపారు. ఈ దాడుల్లో తనతో పాటు పార్వతీపురం మన్యం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ సతీష్, ఎస్ఐలు జె.రాజశేఖర్, శేఖరం, రమణ, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఒడిషా ఎక్సైజ్ సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

జాకేరులో ఫీవర్ సర్వే

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు గ్రామంలో సోమవారం వైద్య సిబ్బంది ఫీవర్ సర్వే చేపట్టారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై సర్వే చేశారు. ఈ సర్వేలో ఎఎన్ఎం లక్ష్మి, వాలంటీర్ శివ, గ్రామ నాయకులు అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

నేరాలు ఘోరాలు

సరుగుడు తోట దగ్ధం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని బంగార్రాజు పేటలో ఐదు ఎకరాల సరుగుడు తోటకు ఆదివారం రాత్రి మంటలు అంటుకోవడంతో దగ్ధమైంది. సోమవారం ఉదయం గ్రామస్తులు యజమానికి సమాచారం ఇవ్వడంతో వచ్చి చూసేసరికి నాలుగు ఎకరాల సరుగుడు తోట అప్పటికే దగ్ధమైంది. దీంతో 15 లక్షలు నష్టం వాటిల్లిందని తోట యజమాని మండల టిడిపి నాయకుడు కాగితాలు సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో సర్వే నెంబర్ నాలుగులో 8 ఎకరాల సరుడు తోట ఉందని అది కోతకు వచ్చిందన్నారు. దానిని రూ.15లక్షలకు వ్యాపారస్తులు అడిగారని ఇంతలోని ఇలా కాలిపోయిందన్నారు. ఇదంతా గ్రామానికి చెందిన గిట్టని వారు రాజకీయ కక్షతో చేసి ఉంటారని ఆయన ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేస్తానని ఆయన వెల్లడించారు.

కాలిపోతున్న రబ్బర్ పైపులు

రబ్బర్ పైపులు దగ్ధం

ప్రజాశక్తి-బొబ్బిలి

మల్లమ్మపేట రైల్వేక్వార్టర్స్ సమీపంలో సోమవారం రబ్బర్ పైపులు దగ్ధమయ్యాయి. క్వార్టర్స్ సమీపంలో ఖాళీ స్థలంలో ఉన్న చెత్తకు గుర్తుతెలియని దుండగులు నిప్పంటించారు. చెత్త కాలుతూ ఖాళీ స్థలంలో ఉన్న రబ్బర్ పైపులకు మంటలు వ్యాపించడంతో దగ్ధమయ్యాయి. దీంతో నల్లటి పొగ మల్లమ్మపేట, రైల్వే క్వార్టర్స్ ప్రాంతాల్లో కమ్మేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికులు, రైల్వే పోలీసులు మంటలను అదుపు చేశారు.